## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**భూపాలపల్లి రూరల్ :** పట్టణంలోని కృష్ణ కాలనీ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ విశ్వాసేరెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. కారల్ మార్క్స్ కాలనీ, యాదవ నగర్, కృష్ణ కాలనీలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని వినియోగదారులకు సహకరించాలని తెలిపారు.

### నేడు విద్రోహ దినం

**భూపాలపల్లి అర్బన్ :** నేడు(సెప్టెంబర్ 1) విద్రోహ దినాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్స్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్‌కుమార్, సదాశివలు ప్రకటనలో పిలుపునిచ్చారు. పాత పెన్షన్ విధానం రద్దు చేసి నూతన పెన్షన్ విధానం తీసుకువచ్చిన సందర్భంగా ప్రతి ఏటా సెప్టెంబర్ 1వ తేదీన పెన్షన్ విద్రోహ దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### ఆర్థికసాయం



**చిట్యాల :** మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సి) గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ అప్పుల బాధ భరించలేక ఉరివేసుకుని శనివారం మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకు గ్రామస్తులు చందాలు వేసుకుని అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ



**టేకుమట్ల :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం గ్రామానికి చెందిన పింగిలి జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను టేకుమట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్, జిల్లా నాయకుడు కత్తి సంపత్, పొన్నం భిక్షపతిలు శనివారం పరామర్శించారు. అనంతరం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు కొయ్యడ చిరంజీవి, కొరె చంద్రమౌళి, జగన్‌మోహన్‌రావు, శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్‌లు పోలాల సరోత్తం రెడ్డి, నందికొండ రాంరెడ్డి, పోతనవేని ఐలయ్య తదితరులు ఉన్నారు.

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

**చిట్యాల :** మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తి శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సీ) గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ (32) మద్యానికి బానిసై ఇంట్లో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున శ్రీనివాస్ బాత్‌రూమ్‌లో ఉరేసుకోగా అతని భార్య రమ చూసి కేకలు వేసింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే శ్రీనివాస్‌ను ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుడి తల్లి విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

### పిచ్చి కుక్కల వీరంగం

**కాటారం :** మండలంలోని చింతకానిలో శనివారం వీధి కుక్కలు వీరంగం సృష్టించాయి. మనుషులు, పశువులు అని తేడా లేకుండా ఎక్కడికక్కడ దాడి చేసి గాయపర్చాయి. గ్రామంలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న లోకేష్ అనే చిన్నారిని కరవడంతో గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. మరో ఎనిమిది పశువులు, మూగ జీవాలపై దాడి చేశాయి. పిచ్చి కుక్కల దాడిలో గాయాలపాలైన వాటిలో గేదెలు, ఎడ్లు, ఆవులు, మేకలు కూడా ఉన్నాయి. పిచ్చి కుక్కలు నేరుగా ఇళ్లలోకి వెళ్లి మూగజీవాలపై దాడికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.

### హర్షణీయం

**ములుగు రూరల్ :** 'రాణి లక్ష్మిబాయి ఆత్మ రక్ష పరిష్కారం'లో భాగంగా జిల్లాలోని 59 పాఠశాలలను ఎంపిక చేయడం హర్షణీయమని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

# సమయపాలన పాటించాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

**భూపాలపల్లి రూరల్ :** భూపాలపల్లి రూరల్ మండలం గొల్లబుద్ధారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్ రెడ్డి అధ్యక్షతనలో పదోన్నతి పొంది ఇతర స్కూళ్లకు వెళ్తున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈఓ రాజేందర్‌తో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నూతనంగా పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులతోపాటు, బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎక్కడ పని చేసిన సమయపాలన తప్పక పాటించాలన్నారు. పని చేసిన చోట విద్యార్థులకు ఉత్తమ బోధన చేస్తే వారిని చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని గుర్తు చేశారు. సన్మాన కార్యక్రమం అనంతరం పాఠశాలలోని నూతన తాగునీటి వాటర్ ప్లాంట్ ఎమ్మెల్యే ప్రారంభించారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ప్రిన్సిపాల్‌కు..**

**చిట్యాల :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన ప్రిన్సిపాల్ శరదృతిని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ సన్మానించారు. కళాశాల అభివృద్ధితో పాటు విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది జిల్లాలోనే ఉత్తమ ర్యాంకులు సాధించేలా కృషి చేశారని ఆమె సేవలను కొనియాడారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ శ్రీదేవికి శుభాంక్షలు తెలిపారు. కళాశాల సిబ్బంది బాలకృష్ణ, రాంచందర్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న మధువంశీకృష్ణ

**ఎస్సైకి సన్మానం**

**భూపాలపల్లి రూరల్ :** ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న భూపాలపల్లి ఎస్సై సంధ్యారాణిని శనివారం తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. అలాగే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ శాఖలో పదవి విరమణ పొందిన బిట్ల వెంకటేశ్వర్లను సైతం సన్మానించారు. కొలిపాక శ్రీనివాస్, పిట్ట ఉమాదేవి, వంగ కుమారస్వామి, కుసుమ సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

# సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

- మహదేవపూర్ సీఐ రామచంద్రరావు

**కాళేశ్వరం :** గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించొచ్చని మహదేవపూర్ సీఐ రామచంద్రరావు అన్నారు. శనివారం కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌లో కాళేశ్వరంలోని లాడ్జిలు, కిరాణా దుకాణాలు, ట్రాక్టర్ యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకారం అందించాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు అమర్చితే అపరిచిత వ్యక్తులు, అనుమానితులను వెంటనే గుర్తించ వచ్చన్నారు. కెమెరాలు రాత్రివేళల్లో గస్తీకాసే పోలీసులాగా పనిచేస్తాయని తెలిపారు. కాళేశ్వరంలో రద్దీ ప్రదేశాల్లో ప్రజల సహకారంతో త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. లాడ్జి నిర్వాహకులు అనుమానితులకు అద్దెకు ఇవ్వరాదని, వెంటనే సమాచారం అందించాలని పేర్కొన్నారు. అద్దెకు వచ్చేవారి వివరాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా నిర్వహణ చేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై చక్రపాణి, సివిల్ పోలీసులు ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

## అప్రమత్తంగా ఉండాలి

**మొగుళ్లపల్లి :** భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున్న మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువుల్లో చేపల వేటకు వెళ్లకూడదని తహసీల్దార్ సునీత శనివారం ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలకై తహసీల్దార్ కార్యాలయంలో 88976 22155 కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

**మల్హర్ :** భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రవికుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. అత్యవసర సమయంలో 79950 88372 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

**మహాముత్తారం :** మూడ్రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహాముత్తారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని లోతట్టు ప్రాంతాలు రెడ్డిపల్లి, కనుకునూర్, నిమ్మగూడెం, యత్నారం, సింగారం గ్రామాల ప్రజలు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏ సమస్య ఉన్న వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# సభ్యత్వ నమోదు చేపట్టాలి

**కాటారం :** గ్రామ గ్రామాన సభ్యత్వ నమోదు చేపట్టి అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి అధ్యక్షతన నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిస్డ్ కాల్ పద్ధతి ద్వారా సభ్యత్వ నమోదు చేయించడంపై వివరించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 50 లక్షల సభ్యత్వాలు లక్ష్యంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వాలు అధిక సంఖ్యలో చేపట్టాలని సూచించారు. దేశంలో ప్రధాని మోదీ, బీజేపీ చేపడున్న సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్ రావు, మండల కన్వీనర్ మంత్రి సునీల్, కోకన్వీనర్ అజ్మీరా వేణు, తోడె శ్రీనివాస్‌రెడ్డి, ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ దుర్గం తిరుపతి, సంపత్, పాగె రంజిత్, పూసాల రాజేంద్రప్రసాద్, హనుమయ్య, శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

**చిట్యాల :** ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. మండలంలోని జడలపేట శివారు గాంధీనగర్ ఎస్సీ కాలనీలో శనివారం పోలీస్, రెవెన్యూ అధికారులు పౌరహక్కుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ..తమ కాలనీలో ఇందిరమ్మ ఇళ్లు కావాలని, గుడిసెలలో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అలాగే తాగునీటి సమస్య ఉందని పేర్కొన్నారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. మీ సమస్యలను సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని చెప్పారు. అలాగే దళితులపై దాడులు చేసిన, దూషించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ భాస్కర్ల రాజు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.



చిట్యాల: గాంధీనగర్‌లో మాట్లాడుతున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

**పౌరహక్కుల దినోత్సవంపై అవగాహన**

**మొగుళ్లపల్లి :** కుల, మతాలకు అతీతంగా జీవించాలని నాయబ్ తహసీల్దార్ వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పిడిసిల్ల గ్రామంలో శనివారం అంటరానితనంపై పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించి గ్రామస్తులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలని కులాల పేరుతో ఎవరిని కించపర్చకూడదన్నారు. అలా చేస్తే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజ్యాంగం హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఇచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు నాటి రక్షించాలి

**భూపాలపల్లి రూరల్ :** ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని భూపాలపల్లి 16వ వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా శనివారం మున్సిపల్ పరిధిలోని రాంనగర్‌లో ఆయన ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సూచించారు. మహిళ సంఘాల నాయకులు, ఆర్పీలు మమత, అనిత, వార్డు కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు బొల్లం కుమారస్వామి, ఉడుత యాకయ్య, సముద్రాల అజయ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

## వర్షానికి కూలిన ఇళ్లు



**కాటారం :** మండలంలో సుమారు నాలుగు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో వర్షపాతం 29.4 మిమీగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని దేవరాంపల్లి, శంకరాంపల్లి, బొప్పారం, దామెరకుంట, గంగారం తదితర ప్రాంతాల్లోని పత్తి చేలలో వరదనీరు భారీగా నిలిచింది. వరుస వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తి చేలలో నిత్యం నీరు నిల్వ ఉండటంతో చెట్టు వేళ్లకు చెదలు రావడంతో పాటు చెట్టు ఎదగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోపాల్‌పూర్‌లో దుర్గం రాజు అనే వ్యక్తికి చెందిన ఇళ్లు కూలి నష్టం వాటిల్లింది. సమయానికి ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మండలంలో వర్షం కారణంగా పలు చోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

# ఆటో కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

**కాటారం :** ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మండలంలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ సతీశ్‌పై అక్రమంగా కేసు పెట్టి ఆటో సీజ్ చేశారని నిరసిస్తు శనివారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఆటో డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారిపై వారు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సతీశ్ ఆటోలో ప్యాసింజర్‌ను తీసుకొని కాటారం నుంచి దామెరకుంట వైపుగా వెళ్తున్నాడు. గంగారంలో ఓ మహిళ ప్రయాణికురాలిని ఎక్కించుకున్నాడు. ఇదే క్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆటోను వెంబడించి తనిఖీ చేయగా సదరు మహిళ సంచిలో గుడుంబా దొరికిందని దీంతో అధికారులు మహిళతో పాటు అన్యాయంగా డ్రైవర్‌పై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేశారని సతీశ్‌తో పాటు ఇతర డ్రైవర్లు ఆరోపించారు. డ్రైవర్‌కు తెలియకుండా జరిగిన సంఘటనకు ఆయనను బలి చేయడం సరికాదన్నారు. ఆటో సీజ్ కావడంతో సతీశ్ ఉపాధి కోల్పోవాల్సి వస్తోందని వెంటనే అధికారులు కేసు తొలగించి ఆటోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వీరికి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. సుమారు గంట పాటు ఆందోళన కొనసాగింది. సీఐ నాగార్జునరావు సంఘటన స్థలానికి చేరుకొని ఏదైనా ఉంటే అధికారులతో మాట్లాడి పరిష్కరించుకోవాలని సూచించారు. మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ నాయకులు బాధితుడు, ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎక్సైజ్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. ఈ ఆందోళనలో ఆటో యూనియన్ నాయకులు కేతిరి రాజు, బీజేపీ నాయకులు చల్ల నారాయణరెడ్డి, దుర్గం తిరుపతి, బండం మల్లారెడ్డి, పాగె రంజిత్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

- సమీక్ష సమావేశంలో ఎస్ఈ మల్హూర్ నాయక్

**భూపాలపల్లి రూరల్ :** విద్యుత్ వినియోగదారులకు మెరుగైనా సేవలందించాలని ఎస్ఈ మల్హూర్ నాయక్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. శనివారం భూపాలపల్లి సర్కిల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాల్హూర్ నాయక్ మాట్లాడుతూ..డాటా బేస్ సమాచారం ఏ లొకేషన్‌లో అయితే ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అయ్యే అవకాశం ఉన్న వాటిని తనిఖీ చేసి లోపాలను సవరించాలన్నారు. మళ్లీ ఫెయిల్ కాకుండా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన యూనిక్ పోల్ నంబరింగ్ పక్రియ వేగవంతం చేయాలని, అలాగే మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎవరైతే కేబుల్ బ్యాండ్ ఆపరేటర్లు తమ కేబుల్‌లను విద్యుత్ స్తంభాలపై వేసుకుంటున్నారో వాటిని ఒక క్రమ పద్ధతిలో సరిచేసుకొని బ్రేక్ డౌన్‌ను పునరుద్ధరించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూసుకోవాలని తెలిపారు.అంతేకాకుండా ఈ కేబుల్ వైర్లు అస్తవ్యస్తంగా ఉండటం వల్ల వినియోగదారులు విద్యుత్ వైర్లకు కేబుల్ వైర్లకు తేడా తెలియక భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కేబుల్, బ్రాడ్ బ్యాండ్ ఆపరేటర్లు వినియోగించే వైర్లను క్రమపద్ధతిలో సరిచేసుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం పోల్ రెంటల్ చార్జీలను వసూలు చేయాలన్నారు.వ్యవసాయ సర్వీసులకు సంబంధించిన పంపుసెట్లకు విద్యుత్ ఇవ్వడానికి అంచనాలు,వర్క్ ఆర్డర్లను త్వరగా మంజూరు చేసి 30-45 రోజుల వ్యవధిలో కొత్త వ్యవసాయ కనెక్షన్లను మంజూరు చేయాలన్నారు. పంట కోతల తర్వాత యాసంగి సీజన్ మధ్య కాలంలో పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్లన్నీ మంజూరు చేయాలన్నారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమంలో ఎవరైతే అర్హత ఉండి, గృహజ్యోతి లబ్ధిపొందని వినియోగదారులు తమ దరఖాస్తులను ఇవ్వడానికి అవగాహన కల్పించాలని ఎస్ఈ తెలిపారు.

## విజృంభిస్తున్న జ్వరాలు

**కాటారం :** మండల కేంద్రంలోని కాలనీలతో పాటు ఎర్రగుంటపల్లి, పలు గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాపిస్తుండటంతో ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఎర్రగుంటపల్లిలో ఇటీవల ఒకరికి డెంగీ పాజిటివ్ రాగా అక్కడ మరికొంత మంది జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రభుత్వ ఆరోగ్య వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు చేపట్టి వైద్య పరీక్షలు చేపడుతున్నప్పటికి జ్వరాలు అదుపులోకి రావడం లేదు. వరుస జ్వరాలు వస్తుండటంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రుల బాట పడుతున్నారు. పారిశుద్ధ్యం లోపించడంతో పాటు కలుషిత నీరు, ఇతరాత్ర కారణాలతో జ్వరాలు ప్రబలుతున్నట్లు పలువురు తెలుపుతున్నారు. అధికారులు పారిశుద్ధ్య నిర్వాహణపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సీపీఎస్ రద్దు కోసం పోరాడాలి

**ములుగు రూరల్ :** సెప్టెంబర్ 1వ తేదీ పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సీపీఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ మడుగూరి నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీపీఎస్ విధానం రద్దుపై ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఏరియా ఆస్పత్రి నుంచి అంబేద్కర్ సెంటర్, గాంధీ చౌక్ వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు. ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఏళ్ల మధుసూదన్, అన్నవరం రవికాంత్, గుల్లగట్టు సంజీవ, మంకిడి రవి, పోరిక సునీల్, సారయ్య, మక్బూల్‌పాషా, సమ్మయ్య, వీరస్వామి, పవన్, తదిరతులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

# స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా తిరుమల్

**భూపాలపల్లి అర్బన్:** సింగరేణి వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్, గేమ్స్ కోఆర్డినేటర్‌గా ఏరియాలోని కేటీకే 6వ గనికి చెందిన వై.తిరుమల్‌ను నియమించినట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి తెలిపారు. ఈ మేరకు శనివారం జీఎం కార్యాలయంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కెప్టెన్‌లను నియమించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జీఎం హబీబ్‌హుస్సేన్ హాజరై నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా జీఎం హబీబ్‌హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా ఎస్‌వోటు జీఎం వెంకటరామిరెడి, కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పర్స శ్రీనివాస్, 18 క్రీడలకు సంబంధించిన కెప్టెన్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల సాధనకు ఉద్యమించాలి

**ములుగు: /ములుగు రూరల్ :** కార్మికులు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలని బీకేఎంయూ(భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంట్రాములు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలకుల విధానాలతో వ్యవసాయ కార్మికుల బతుకులు దుర్భరంగా మారాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయ కార్మిక చట్టాలను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అధిక నిధులు కేటాయించి సంవత్సరంలో 200 రోజులు పని దినాలను కల్పించాలని, ఉపాధి కూలీలకు రోజుకు రూ.700 చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని ఆరోపించారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.6లక్షల నిధులు అందించాలని అన్నారు. వ్యసాయ కార్మికులు ఐక్య ఉద్యమాలను సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జంపాల రవీందర్, ఇంజం కొమురయ్య, అమ్జద్‌పాషా, రాజు, బండి నర్సయ్య, రమేష్, నరేష్, రవి, సమ్మయ్య, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న వెంకట్రాములు

# కులగణన చేసి ఎన్నికలు నిర్వహించాలి

**వాజేడు :** బీసీ కుల గణన చేసిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఓడ బలిజ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్ అన్నారు. మండల పరిధిలోని రాంపురం గ్రామంలో శనివారం ఓడ బలిజ సేవా సంఘం గ్రామ కమిటీల ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాసిక్‌లో పుట్టిన గోదావరి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నర్సాపురం వద్ద సముద్రంలో కలిసే వరకు 1,450 కిలో మీటర్ల గోదావరి ఉందని, దాని పరివాహకం వెంట లక్షలాది ఓడ బలిజ కుటుంబాలు ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఓడ బలిజ కులస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు సబ్సిడీ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట చింతూరి రమేష్, కొప్పుల రమణయ్య, గగ్గురి రమేష్, బద్ది ఆదినరాయణ, కొప్పుల రఘుపతి, గార నాగార్జున తదితరులు ఉన్నారు.

## బొగ్గుల వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలి



**ములుగు రూరల్ :** మండలంలోని సర్వాపూర్-జగ్గన్నగూడెం గ్రామాల మధ్య గల బొగ్గుల వాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని ఏబీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బొగ్గుల వాగు వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బొగ్గుల వాగు ఉప్పొంగిన ప్రతిసారి జగ్గన్నగూడెం గ్రామానికి రాకపోకలు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం స్పందించి బొగ్గుల వాగుపై వంతెన నిర్మించాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క గిరిజన గ్రామాలకు వంతెన నిర్మించకపోవడం శోచనీయమని అన్నారు. వంతెన నిర్మించని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.